కోర్టు ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

న్యాయవ్యవస్థ గౌరవం పెంచేలా పని చేయాలి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు

రామగిరి, జనవరి 13: న్యాయశాఖ ఉద్యోగులు అకుంఠిత దీక్షతో పనిచేసి న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు సూచించారు. నల్లగొండలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయశాఖ ఉద్యోగులు సక్రమంగా పనిచేస్తేనే కోర్టు నిర్వహణ సాఫీగా సాగుతుందన్నారు. అంతకు ముందు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలనా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం బాధ్యులు వీరబాబు, నాయకులు సాగర్‌రెడ్డి, లతీఫ్‌పాషా, గిరిధర్, రాంబాబు, వంశీకృష్ణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ నాయకులు

ఎమ్మెల్యే బీఎల్ ఆర్‌కు వాకర్ల సన్మానం

మిర్యాలగూడ, జనవరి 13: పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌తో, ఇక్కడి వాకర్స్‌తో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని, అనేక సేవా కార్యక్రమాలను తాను ఇక్కడి నుంచే ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

మిర్యాలగూడ : మున్సిపాలిటీ పరిధిలోని 47వ వార్డులో కౌన్సిలర్ ఘని ఆధ్వర్యంలో శనివారం మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్య పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

రామగిరి, జనవరి 13: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై ప్రభుత్వాన్ని ఒప్పించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎనిమిదేండ్లుగా బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమగ్రశిక్ష, కేజీబీవీ, ఆదర్శపాఠశాలల్లో పని చేస్తున్న వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపుతామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంతరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల బాల్‌రెడ్డి, కొడదల శంకర్, సంఘం నాయకులు కందిమళ్ల కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

సీతారామచంద్రస్వామి ఆలయంలో సుదర్శనహోమం

శాలిగౌరారం, జనవరి 13 : ధనుర్మాసోత్సవాల్లో భాగం గా శాలిగౌరారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం సుదర్శనహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి, స్థానిక సర్పంచ్ గౌర వీరయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ సురేశ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మండలాధ్యక్షుడు సమరంరెడ్డి, చామల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మండలకేంద్రం నుంచి బైరవునిబండ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మందుల సామేల్‌కు గ్రామ సర్పంచ్ దండ రేణుకాఅశోక్‌రెడ్డి శనివారం వినతి పత్రం అందించారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

మిర్యాలగూడ రూరల్, జనవరి13 : ఇంటి స్థలం విషయంలో అన్నపై కక్ష పెంచుకొని అతడిపై దాడి చేసి హత్య చేసిన తమ్ముడితో పాటు మరో ఇద్దరిని మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అవంతీరం గ్రామానికి చెందిన పట్టేటి సోములుకు ఇద్దరు కుమారులు. పెద్దవాడు పట్టేటి నాగయ్య(53), రెండో కుమారుడు శ్రీను. ఇద్దరూ కలిసి తండ్రికి చెందిన 6 గుంటల ఇంటి స్థలాన్ని పంచుకునే విషయంలో గొడవ పడ్డారు. ఈ స్థలం పంపకాల్లో అన్న నాగయ్య అడ్డు పడుతుండడంతో అతడి అడ్డు తొలగించుకోవాలని తమ్ముడు శ్రీను పన్నాగం పన్నాడు. అందుకు అవంతీపురం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ఈర్ల మల్లేశ్, త్రిపురారం మండలం పెద్దదేవుల పల్లి గ్రామానికి చెందిన సతీశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. డిసెంబర్27న నాగయ్య ఇంట్లో ఉండగా ముగ్గురు కలిసి ఇనుపరాడ్‌తో నాగయ్యపై దాడి చేయడంతో స్పృహ కోల్పోవడంతో చనిపోయాడని భావించి పారిపోయారు. గాయ పడిన నాగయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదారాబాద్ ఉస్మానియా దావాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 2న మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి చెల్లెలు ఊట్కూరి ఆరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. శనివారం నిందితులు శ్రీను, మల్లేశ్, సతీశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

కట్టంగూర్ : సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

కట్టంగూర్, జనవరి 13 : ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం కట్టంగూర్ తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తుల ఆన్‌లైన్, ఎలక్ట్రోరల్ రివిజన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా సవరణ పక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ సూచనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ పోరెళ్ల సునీత, డీటీ సుకన్య, ఎంపీఓ మహ్మద్ అథర్ పర్వేజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి తాసీల్దార్ కార్యాలయంలో..

నార్కట్‌పల్లి : తాసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సందర్శించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు.

పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టాలి : అడిషనల్ పీడీ నవీన్

చండూరు, జనవరి 13 : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులను పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నవీన్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని, కొలతలు సరిగా సేకరించి కూలీలకు నికర వేతనం అందేలా చూడాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పల్లె కల్యాణి, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, డీపీఎం చకిలం వేణుగోపాలరావు, అంబుడ్స్ మెన్ గౌరి పాల్గొన్నారు.

ప్రజలకు ప్రముఖుల భోగి శుభాకాంక్షలు

మిర్యాలగూడ /హాలియా, జనవరి 13: భోగి పండుగ వేళ ప్రతి ఇంట్లో సిరులు పండాలని, ప్రజలకు శుభం కలుగాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, నోముల భగత్‌కుమార్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి పండుగ సుఖ సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు నల్లగొండ విద్యార్థిని

అక్షిత

నల్లగొండ రూరల్, జనవరి 13: నల్లగొండ పట్టణంలోని కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో 9వ తరగతి చదువుతున్న చింతకాయల అక్షిత జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ సీతారాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 3 వరకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్ –17 బాలికల విభాగంలో అక్షిత పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. దాంతో అధికారులు ఆమెను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 15 నుంచి 20 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ కొంపెల్లి భిక్షపతి, పీఈటీ వేణు అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, జనవరి 13 : మండల కేంద్రంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య పరీక్షలకు అవసరమయ్యే పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులతో నిర్వహించిన సమీక్ష పమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కమిట్‌మెంట్‌తో పని చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియామకం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. బయటి నుంచి వచ్చే వారిలో కొందరు మహిళా సిబ్బంది విషయంలో దురుసుగా ప్రవర్తిస్తున్నారని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రంగారెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మాత్రునాయక్, వైద్యాధికారులు శంకర్, దీపక్, అరుణతారా, తరుణ్, రుబీనా, షాలినీ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

మునుగోడు : నియోజకవర్గం నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు అభివృద్ధిపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్లగొండ పరిధిలోని కచలాపురం నుంచి వెల్మినేడు, తాస్కానిగూడెం నుంచి చండూరు, అంతంపేట నుంచి శివన్నగూడెంవరకు రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. బంగారగడ్డనుంచి నాంపల్లి వరకు, ముష్టిపల్లి నుంచి మల్లేపల్లి వరకు రోడ్డు వెడల్పునకు ప్రపోజల్స్ అందించాలన్నారు. మునుగోడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అభివృద్ధి, నల్లగొండ–చండూరు రోడ్‌లో డివైడర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. సంబంధింత శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోగి నగలు అపహరించిన నిందితులకు రిమాండ్

నందికొండ, జనవరి 13 : కమలానెహ్రూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి నగలు అపహరిచిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీకి చెందిన రమణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గత నెల 17న కమలానెహ్రూ ప్రభుత్వ దవాఖానలో చేరింది. చికిత్స పొందుతూ 22న మృతి చెందింది. దవాఖానలో చేరినప్పుడు రమణమ్మ ఒంటిపై 6 తులాల బంగారు నగలు ఉండగా చనిపోయిన తర్వాత అవి కనిపించకుండా పోయాయి. దాంతో ఆమె కూతురు లక్ష్మీదేవి ఈ విషయమై విజయపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి అనుమానితుడిగా ఉన్న పగడి కల్యాణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. రమణమ్మ ఒంటిపై ఉన్న నగలను అతను అపహరించి తన స్నేహితుడు బోనగిరి వీరయ్యతో కలిసి విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పల్లెల్లో సంక్రాంతి ఆటల పోటీలు

పెద్దవూర : జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చందంపేట, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని బుడ్డోనితండాలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శనివారం కొనసాగాయి. మండలంలోని నల్లచెలమూల గ్రామ నల్లమల, యాపలపాయతండా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నల్లమల జట్టు గెలుపొందింది. విజేతకు బీఆర్ఎస్ పార్టీ బీసీ సంఘం నాయకుడు పొలగోని సత్యనారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాల్‌సింగ్, నాయకులు సురేశ్, ఎల్లయ్య, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, హన్మానాయక్, ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో ముగ్గుల పోటీలు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో శనివారం మాజీ ఎంపీటీసీ రాధారపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దూదిమెట్ల స్రవంతీ వెంకన్న, మాజీ జడ్పీటీసీ దూదమెట్ల సత్తయ్యయాదవ్, మాజీ సర్పంచ్ పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, నాయకులు జెర్రిపోతుల భరత్, భిక్షమయ్య, రాములు, మదన్‌గోపాల్, రమాదేవి, ధనలక్ష్మి, సత్యనారాయణ, వెంకన్న, సంపత్, అండాలు, మంజుల పాల్గొన్నారు.

బట్టుగూడెంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం బట్టుగూడెం యూత్ కమిటీ సభ్యులు ప్రారంభిచారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఈ నెల 17 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు పోటీల్లో పాల్గొని విజయవంతం యాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్, రవి, శంకర్, మహేందర్, ప్రదిప్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

మాడ్గులపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నాయకులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, లక్కి ప్రసాద్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడటౌన్, జనవరి13: మున్నూరు కాపుసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరపు క్యాలెండర్‌ను శనివారం పట్టణంలోని సంఘం భవనంలో ఆవిష్కరించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు కంచి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు నేతి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు పందిరి వేణు, గంధం రామకృష్ణ, పుప్పాల సత్యం, మండల అధ్యక్షుడు బచ్చలకూరి శ్రీను, బండి రామయ్య, తమ్మడబోయిన రాము, గంధం కృష్ణ, మోహన్, చాపల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్మినేడులో క్రీడాపోటీలు

చిట్యాల, జనవరి13 : మండలంలోని వెల్మినేడులో సంక్రాంతి క్రీడా పోటీలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు, వాలీబాల్ పోటీలను ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు దేశబోయిన స్వరూపానర్సింహ, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ ప్రారంభించారు. కార్యక్రమాల్లో జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, కూరాకుల బాలు, నరేశ్, సురకంటి సత్తిరెడ్డి, చిరగోని శ్రీశైలం, చీమల వీరేశం, అంతటి పారిజాత పాల్గొన్నారు.

శిరీష కుటుంబానికి ఎమ్మెల్యే బీఎల్ ఆర్ పరామర్శ

మాడ్గులపల్లి, జనవరి 13: ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన గున్‌రెడ్డి శిరీష కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే బీఎల్ఆర్ పరామర్శించారు. తోపుచర్ల గ్రామానికి చెందిన గున్‌రెడ్డి శిరీష, జాన్‌రెడ్డి దంపతులు హైదరాబాద్‌లోని భవానీనగర్‌లో నివాసముంటున్నారు. జాన్‌రెడ్డి ఆన్‌లైన్ బెట్టింగుల్లో పెద్ద ఎత్తున డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలయ్యాడు. దాంతో మన స్థాపానికి గురైన ఆయన భార్య శిరీష శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకు రాగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ పుల్లెంల సైదులు, సర్పంచులు మంగా యాదయ్య, చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, తమ్మడబోయిన అర్జున్, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, బట్టు మాధవరెడ్డి, నిరంజన్, మోహన్, లక్ష్మయ్య ఉన్నారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి

దామరచర్ల, జనవరి 13 : రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వాడపల్లి వద్ద శనివారం జరిగింది. వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక నుంచి గుంటూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ మండలంలోని నార్కట్‌పల్లి– అద్దంకి ప్రధాన రహదారి వాడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని విష్ణుపురం లారీ యార్డు వద్ద కారును ఢీకొట్టడంతోపాటు డివైడర్‌ను దాటి ఎదురుగా నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో కర్ణాటకకు చెందిన లారీ యజమాని సుభాశ్ గార్కే(39) లారీలో ఇరుక్కుపోగా స్థానికులు బయటకు తీసి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలో గార్కే మృతి చెందాడు. అదే లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న మహేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. వాడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యే వీరేశానికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, జనవరి 13 : మండలంలోని షాపల్లి గ్రామంలోని కమలాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఆలయ అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు, రాకేశ్‌చార్యులు అందించారు. నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 25న నిర్వహించనున్న స్వామి వారి కల్యాణోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సిద్ధగోని స్వామి ఉన్నారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పోటీలు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ వెంకటేశం

గట్టుప్పల్, జనవరి 13 : స్వామి వివేకానంద 161వ జయంతి ఉత్సవాల సందర్భంగా లైట్ అండ్ లైఫ్ యూత్ గట్టుప్పల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను చండూరు జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, సర్పంచ్ ఇడం రోజా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రవీందర్, వీరభద్రరావు, ఎం. సత్తయ్య గౌడ్, మల్లేశం,యూత్ సభ్యులు దోర్నాల వినయ్ కుమార్, భీమగాని సుభాశ్, యిడం విజయకుమార్, డి. గౌతమ్, నామని వాసు పాల్గొన్నారు.

మహిళలకు చీరెల పంపిణీ

నిడమనూరు : మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్

నిడమనూరు, జనవరి 13 : మండల కేంద్రంలోని భక్తాంజనేయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వృద్ధ మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. ప్రమోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంస్థ సభ్యులు వృద్ధులకు చీరెలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జోజి, సంస్థ అధ్యక్షుడు సిరి ప్రవర శ్రీనివాసశర్మ, సలహాదారులు రుద్రాక్షి నర్సింహ, జన్నపాల రమేశ్, పీఆర్‌టీయూ జిల్లా నాయకుడు పాంపాటి శ్రీనివాసులు, శ్రీనివాస్ ప్రసాద్, మెరుగు మధు, బత్తుల సూరయ్య, మంగు నాయక్, గొల్లపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

భూ సమస్యలను చట్ట పరిధిలోనే పరిష్కరించాలి

- లా ఫ్యాకల్టీ ఏపూరి రాములు

పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏపూరి రాములు

నీలగిరి, జనవరి 13 : భూసమస్యలకు చట్టం పరిధిలోనే పరిష్కారం చూపాలని, వ్యక్తిగత పంచాయతీలు నిర్వహించవద్దని సీనియర్ లా ఫ్యాకల్టీ ఏపూరి రాములు సూచించారు. శనివారం భూ వివాదాల కేసుల్లో ఎదురయ్యే సమస్యలకు న్యాయ పరమైన అంశాలపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్య సివిల్ కేసుగా ఉంటుందన్నారు. ఈ విషయంలో జరిగే గొడవలు, ఇతర విషయాల పైనే చట్టపరంగా వ్యవహరించాలన్నారు. కానీ వ్యక్తిగత పంచాయతీలు నిర్వహించి వివాదాల్లోకి తలదూర్చవద్దని సూచించారు. పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ సోమ్ నారాయణ సింగ్, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డీఎస్పీలు శ్రీధర్‌రెడ్డి, వెంటకగిరి, గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయురాలికి ఉత్తమ అవార్డు

అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు రాపోలు శైలజ

త్రిపురారం, జనవరి 13: మండల కేంద్రంల